పేదల జోలికొస్తే ఊరుకోం



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

- నోటీసులివ్వడం సరికాదు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- హైడ్రా నోటీసులిచ్చిన ప్రాంతాల పరిశీలన

మోతీనగర్: ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇండ్లను కూల్చివేస్తామని హైడ్రా అధికారులు నోటీసులివ్వడం సరికాదని, వారి జోలి కొస్తే ఊరుకోం అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్‌లో కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి హైడ్రా నోటీసులు ఇచ్చిన కుటుంబాలతో శుక్రవారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకొని పేద ప్రజలు జీవిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాజీవ్ గాంధీనగర్ కాలనీ ఏర్పాటు జరిగిందని, అదే సమయంలో సఫ్దార్ నగర్, పద్మావతి నగర్ ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్లు చేసుకున్న ఇళ్లకు సైతం హైడ్రా అధికారులు నోటీసులు జారీ చేయటం బాధాకరమైన విషయమని అన్నారు. కొంతమంది పార్టీల లీడర్లతో ఫొటోలు దిగి బిల్డింగ్‌ల దగ్గర లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, అలాంటి వారిపైన చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలు భయపడవద్దని, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.



ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

పనులను పూర్తి చేయాలి

బాలానగర్: సివరేజీ ట్రీట్‌మెంట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కార్పొరేటర్ సతీష్ గౌడ్‌తో కలిసి ఫతేనగర్ డివిజన్‌లోని ఎల్‌బీఎస్ నగర్‌లో నిర్మించే సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ప్లాంట్‌ను ప్రారంభించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకుల కూతాడి రాములు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా ఉంటాం



నోటీసులు అందుకున్న వారితో మాట్లాడుతున్న కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: హస్మత్‌పేట బోయిన్ చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు అండగా ఉంటామని కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. శుక్రవారం మేయర్ రాక సందర్భంగా బోయిన్ చెరువు కట్టపైకి చేరుకున్న ప్రజలు తమకు వచ్చిన నోటీసుల గురించి కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నోటీసులు వచ్చిన తక్షణమే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారని, కలెక్టర్, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

కమాన్ నిర్మాణానికి భూమి పూజ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని ఆలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ కమాన్ నిర్మాణానికి శుక్రవారం వివేకానందనగర్ కాలనీ అధ్యక్షులు వడ్డేపల్లి రాజేశ్వరరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీ వాసులు అందరూ కలిసి ఆలయ అభివృద్ధితో పాటు ఆలయ కమాన్‌కు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఆలయ కమాన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాజేశ్వరరావు, సంఘం ప్రతినిధులు

ఓల్డ్ బాలాజీనగర్ ఉత్సవ కమిటీ ఏర్పాటు

కూకట్‌పల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఓల్డ్ బాలాజీనగర్ గణేష్ ఉత్సవ కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా స్వరూప గౌడ్, వైస్ ప్రెసిడెంట్‌గా సుభాష్ గౌడ్, కోశాధికారిగా మల్లికార్జునరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేష్, మెంబర్‌గా వెంకటేష్, రవీందర్‌రెడ్డి, విజయ్‌గౌడ్, రాంబాబు తదితరులు నియమితులయ్యారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయండి

- 17 చెరువుల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశం
- రూట్ మ్యాప్‌తోసహా వాహనాలను సమకూర్చుకోవాలి
- క్రేన్లు, అంబులెన్సు అందుబాటులో ఉంచాలి
- నిమజ్జన చెరువుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి
- జిల్లా సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువుల్లో గణేష్ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి పటిష్ట ప్రణాళిక రూపొందించుకోవటంతో పాటు నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయా రూట్లలో రోడ్ల మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై సమన్వయ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికాగుప్తా, రాచకొండ డీసీపీ కరుణాకర్‌తో కలిసి జిల్లా సమన్వమయ సమావేశాన్ని కలెక్టర్ గౌతమ్ నిర్వహించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణా శాఖ అధికారులు సర్దిపై చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

- ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గణేష్ నిమజ్జనం సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు కలెక్టర్ సూచించారు.
- వినాయక నిమజ్జనానికి చెరువుల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో ఇద్దరు మెడికల్ అఫీసర్లు, సిబ్బంది 24 గంటలు షిఫ్టుల వారిగా విధులు నిర్వహించేలా చూడాలన్నారు.
- అంబులెన్సును అందుబాటులో ఉంచటంతో పాటు అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లే దారి క్లియర్‌గా ఉండేలా చూడాలన్నారు. వైద్య శిబిరాలు ప్రజలకు కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఎమర్జెన్సీ సందర్భాల్లో దగ్గరలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో ఉచితంగా ఫస్ట్ ఎయిడ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు.
- నిమజ్జన ప్రదేశాలలో గతంలో కంటే అధిక సంఖ్యలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని జిల్లా మత్స్య శాఖ అధికారిని కోరారు. వినాయక నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి నిమజ్జన స్థలం వద్ద అదనపు ట్రాన్స్‌పార్మర్, పవర్ జనరేటర్లను ముందు జాగ్రత్తగా అందుబాటులో ఉంచాలన్నారు.
- కాలుష్య నియంత్రణ మండలి చెరువుల వద్ద పొల్యూషన్ లెవెల్స్ చెక్ చేస్తూ.. ఉండాలన్నారు. గణేష్ నవరాత్రులు మొదలు కొని నిమజ్జనం పూర్తయ్యే వరకు అగ్ని మాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.
- ప్రతి నిమజ్జన చెరువుకు ఒక నోడల్ ఆఫీసర్, సంబంధిత శాఖల సిబ్బందితో కూడిన బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్లతోపాటు అదనంగా కొన్ని క్రేన్లను సన్నద్ధం చేయాలన్నారు.
- శామీర్‌పేట చెరువు దగ్గర అవసరమైన మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.
- ఈ సందర్భంగా భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ హరిప్రియ పోలీస్, ట్రాఫిక్, మత్స్య, వైద్య, అగ్నిమాపక, అర్ అండ్ బీ, పొల్యూషన్, విద్యుత్తు, జల మండలి శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మున్సిపాలిటీల కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



'వాక్ ఫర్ హోప్' పోస్టర్ ఆవిష్కరణ



దుండిగల్: నగరంలోని జలవిహార్‌లో నవంబర్ 17వ తేదీన వాక్ ఫర్ హోప్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శుక్రవారం దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించారు. వాక్ ఫర్ హోప్ అనే కార్యక్రమం ద్వారా నిధులు సమీకరించి తెలంగాణ రాష్ట్రంలో ఒక ప్రత్యేక హోం నిర్మిస్తామని, అందులో వృద్ధులు, అనాథ పిల్లలకు వసతి కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రమణి, సాకేత్ ప్రణామ్ హోమ్స్ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన చేపట్టాలి

ఆల్విన్‌కాలనీ: బీసీల న్యాయబద్ధ వాటా కోసం, సమగ్ర కులగణన కోసం శుక్రవారం జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీసీ నాయకులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మాచర్ల భద్రయ్య పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. అనంతరం బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు సతీష్ కుమార్ పటేల్ మాట్లాడుతూ.. సమగ్ర కులగణన చేపట్టి 42 శాతం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. లేకుంటే బీసీలంతా ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పంతుల మల్లయ్య, భక్తుల రామ నరసయ్య, వీరాంజనేయ చారి, విఠల్, ఉగ్గే శ్రీనివాస్, శ్రీరాములు, సిద్ధి రాములు, తెలుగు సుధాకర్, నరసయ్య, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న సతీష్ కుమార్ పటేల్ తదితరులు

కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించి నిర్మాణం!



బాగ్‌అమీర్ పెట్రోల్ బంక్ వద్ద నిర్మిస్తున్న భవనం

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ఆల్విన్‌కాలనీ: అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను నిలువరించాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాగ్ అమీర్ పెట్రోల్ బంక్ వద్ద చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని స్థానికులు జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్టిల్+3 అంతస్తులకు మున్సిపల్ అధికారులు అనుమతులిచ్చారు. నిర్మాణదారుడు అనుమతులు తీసుకున్న స్థలానికంటే ఎక్కువ(కాలనీ స్థలంలో) సెల్లార్ తవ్వి దానిపై శ్లాబ్ ఏర్పాటు చేశారు. సెల్లార్ అనుమతి లేదంటూ ఇది అక్రమ నిర్మాణమని మున్సిపల్ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. ఈ నోటీసుపైన సదరు నిర్మాణదారుడు కోర్టుకు వెళ్లి స్టేటస్ కో తెచ్చుకున్నాడు. దీని ప్రకారం మున్సిపల్ అధికారులు నిర్మాణంపై ఎటువంటి చర్యలు తీసుకోకూడదు. అలాగే భవన నిర్మాణదారుడు కూడా తదుపరి నిర్మాణం చేయకూడదని ఉత్తర్వుల్లో ఉన్నది. కానీ ఆ భవన నిర్మాణదారుడు ఈ ఉత్తర్వులను ఉల్లంఘించి నిర్మాణాన్ని చేపడుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోర్టు స్టేటస్ కో ఇచ్చినప్పుడు సెల్లార్‌పై శ్లాబ్ మాత్రమే ఉండేది. ప్రస్తుతం మొదటి అంతస్తు కూడా పూర్తి చేసుకొని రెండవ అంతస్తు నిర్మాణానికి కూడా పనులు జరుగుతున్నాయి. ఈ భవనం పూర్తయితే కమర్షియల్ కాంప్లెక్స్‌తో కాలనీ వారికి ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేశామని, అయినా కూడా నిర్మాణం ఆపడం లేదని వాపోతున్నారు. కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించి జరుగుతున్న ఈ నిర్మాణాన్ని వెంటనే అడ్డుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పూర్తి చేయాలి

- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు
- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

కూకట్‌పల్లి: ఆయా చెరువుల వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం బాలాజీనగర్ డివిజన్‌లోని శ్రీరంగధాముని చెరువులో జరిగే నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావుతో కలిసి మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనాలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణ దృష్ట్యా మట్టి వినాయకులను మాత్రమే ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో డీసీ రమేష్, ఏఈ శ్రీనివాస్, వాటర్‌వర్క్స్ డీజీఎం శిరీష, మేనేజర్ సలోని, డీఈ స్వప్న, ఎంటమాలజీ మహేందర్, ఎలక్ట్రికల్ ఏఈ, సీఐ ముత్తు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్, రాంకీ సంస్థ మేనేజర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట బోయిన్ చెరువును కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, కూకట్‌పల్లి డీసీ కృష్ణయ్య, ఎస్ఈ చెన్నారెడ్డితో కలిసి మేయర్ విజయలక్ష్మి పరిశీలించారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. వినాయక చవితి సందర్భంగా జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, పోలీసులు, శానిటేషన్, రాంకీ, ట్రాఫిక్, విద్యుత్ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బతుకమ్మ కుంటను పరిశీలించి తక్షణమే పాత నీటిని తొలగించాలన్నారు. చెరువు ప్రాంతాల్లో లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నివాసం ఉంటున్న వారికి నోటీసులు రావడాన్ని మేయర్ దృష్టికి తేవడంతో ముఖ్యమంత్రితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని, ధైర్యంగా ఉండాలని ప్రజలకు చెప్పారు.



అంబీర్ చెరువు వద్ద వినాయక నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, జెడ్‌సీ చౌహాన్



బోయిన్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను తెలుసుకుంటున్న మేయర్ విజయలక్ష్మి

అధికారుల గైర్హాజరు.. మేయర్ ఆగ్రహం

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బోయిన్ చెరువు పరిశీలన సందర్భంగా ఆయా విభాగాల అధికారులు హాజరు కాలేదు. దీంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ఉండటమేంటని ప్రశ్నించారు. పోలీసులు, రెవెన్యూ, విద్యుత్ విభాగాల అధికారులు రాకపోవడంతో విస్మయం వ్యక్తం చేశారు. మేయర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు హాజరు కాకపోవడంపై ఆరా తీశారు. సమాచారం లేదని చెప్పడంతో అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్‌రావు, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డీఈ స్వప్న, ఏఈ మృదుల అభయ్ రంజన్, రవినాయక్, నర్సింహరావు, శ్రీకాంత్‌రెడ్డి అరుణ, గోపిరెడ్డి, నాయకులు మల్లికార్జున్‌యాదవ్, గడ్డం నర్సింగ్‌రావు, బాలరాజు, మక్కాల సత్యనారాయణ, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, దేవేందర్, చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంబీర్ చెరువు వద్ద..

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు బీబీ పాండ్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, జెడ్‌సీ అపూర్వ చౌహాన్, డీసీ కృష్ణయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి కొలనును వెంటనే శుభ్రపరిచి కొత్త నీటితో నింపాలని, పలు ప్రాంతాల్లో రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో అశ్రద్ధ వహించవద్దన్నారు. శోభా యాత్ర జరిగే ప్రాంతాల్లో రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప కమిషనర్లు, ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, పారిశుద్ధ్యం, ఎంటమాలజీ విభాగం, మెడికల్ అధికారులు, జీహెచ్ఎంసీ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డిని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కోరారు. శుక్రవారం డీసీ ముకుంద్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో కలిసి పూల మొక్కను అందించారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, కొనసాగుతున్న పనులను డీసీకి వివరించారు. ప్రస్తుతం డివిజన్ పరిధిలో పెండింగ్ పనులు, నూతనంగా అవసరమైన పనులకు నిధుల వివరాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... అన్ని విభాగాల అధికారులతో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని సమస్యల పరిష్కారంపై చర్చిద్దామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హన్మంతునాయక్, నాయకులు శేఖర్, రాజు, పల్లపు చంద్రమౌళి, సుమన్, రమేష్ పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి సర్కిల్ డీసీని కలిసిన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అడ్డగుట్ట 11 కేవీ ఫీడర్, 33/11కేవీ హెచ్ఎంటీ హిల్స్ సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి 1 గంట వరకు భాగ్యనగర్‌కాలనీ ఫేజ్ 3లో, 11:30 నుంచి 1 గంట వరకు ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలోని హెచ్ఎంటీ హిల్స్, ఆదిత్య హోమ్స్ వెనుక వైపు, ఆదిత్య నగర్, తులసినగర్, శుభోదయ కాలనీల్లో, 3:30 నుంచి 5 గంటలకు వినాయక ఫీడర్ పరిధిలో హెచ్ఎంటీ శాతవాహన నగర్, కళామందిర్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్ 11కేవీ పీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు ఆర్‌పీ కాలనీ, రామకృష్ణ నగర్, హనుమాన్‌నగర్, దీనబంధు కాలనీ, మాధవరం నగర్ కాలనీ, పాపిరెడ్డినగర్, ప్రగతి నగర్, 11 కేవీ. జయనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి 1 గంట వరకు విజయ్‌నగర్‌కాలనీ, నవోదయ కాలనీ, శుభోదయ కాలనీ, 11 కేవీ పాపారాయుడు నగర్ ఫీడర్ పరిధిలో 1:30 నుంచి 3 గంటల వరకు పాపారాయుడు నగర్, సాయిబాబా కాలనీ, ఏవీబీ పురం, ప్రకాష్ నగర్‌లలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

చెరువులు, నాలాల పరిరక్షణకు..

అక్రమ కట్టడాలను కూల్చివేయాలి

కూకట్‌పల్లి: నియోజకవర్గ పరిధిలో కనుమరుగవుతున్న చెరువులు, నాలాలను పరిరక్షించేందుకు అక్రమ కట్టడాలను కూల్చివేయాలని టీపీసీసీ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక ప్రజాప్రతినిధి అండతో నియోజకవర్గంలో అక్రమ కట్టడాలకు హద్దు, అదుపు లేకుండా పోయిందన్నారు. ఆ ఆక్రమణలో భీముని కుంట, కాముని చెరువు, రంగధాముని కుంట, సున్నం చెరువు, పరికి చెరువు, నల్ల చెరువు, మైసమ్మ చెరువు, ముళ్లకత్వ చెరువులు కూడా ఉన్నాయని తెలిపారు. అక్రమ కట్టడాలకు అనుమతులిచ్చిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న వినయ్‌కుమార్

గ్యాస్ పైపులైన్ లీక్.. ఎగిసిపడ్డ మంటలు



మంటలను ఆర్పుతున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

చింతల్: జీడిమెట్ల పారిశ్రామికవాడ ఫేస్– 3లో భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ కంపెనీ గ్యాస్ పైపులైన్ లీక్ కావడంతో మంటలు ఎగిసిపడ్డాయి. అగ్నిమాపక ఆఫీసర్ తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్లలోని నసెన్స్ ల్యాబ్ ముందు ఉన్న నాలాలో శుక్రవారం తెల్లవారుజాము 2 గంటల ప్రాంతంలో భాగ్యనగర్ గ్యాస్ పైపులైన్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. మంటలను గమనించిన స్థానికులు, నసెన్స్ ల్యాబ్ కార్మికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఉదయం 6 గంటలకు లీకేజీపై సమాచారం అందుకున్న భాగ్యనగర్ గ్యాస్ అధికారులు గ్యాస్ సరఫరాను నిలిపి వేశారు. మంటలు ఆగిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇంత పటిష్టమైన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదవశాత్తు లీకేజీ ఏర్పడిందా? లేక మరి ఏమైనా ఇతర కారణాలున్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హెచ్‌సీయూ విద్యార్థినికి ప్రతిష్టాత్మక అవార్డు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని విద్యార్థినికి ప్రతిష్టాత్మకమైన క్వాలిటీ ఎక్సలెన్స్‌లో డాక్టర్ దినేష్ మెమోరియల్ అవార్డు వచ్చింది. స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో హెల్త్ కేర్ అండ్ హస్పిటల్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ కోర్సులో రెండో సంవత్సర చదువుతున్న డాక్టర్ ఆర్య అగర్వాల్ డాటాకాన్–2024 సదస్సులో పాల్గొని అవార్డును అందుకున్నారు. రూ.10వేల నగదు పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెను ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు అభినందించారు.

ఏరియా ఆస్పత్రిలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

రోగులు కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంపై అసహనం

చందానగర్: కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రిని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సూపరింటెండెంట్ అనురాగినిరెడ్డిలు కమిషనర్ కర్ణన్‌ను స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ ఓపీ రోగుల వార్డులను పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. ల్యాబ్‌లలో రక్త పరీక్షలు ప్రతి రోజు ఎన్ని పరీక్షలు చేసి రిపోర్టులు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్య పరీక్షలు చేసేటప్పుడు రోగులు కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో వైద్యులపై అసహనం వ్యక్తం చేశారు.

- అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కొండాపూర్ జిల్లా ఆస్పత్రిని తనిఖీలు చేశానన్నారు. వైరల్ జ్వరాలతో ప్రభుత్వ ఆసుపత్రులు నిండిపోతున్నాయని అన్నారు. ఈ ఆస్పత్రుల్లో రోగులకు కనీస వసతులు ఉన్నాయా లేవా అనే దానిపై తనిఖీలు చేపడుతున్నామని అన్నారు.
- గర్భిణులకు మెటర్నిటీ వార్డులో డెలీవరీలు కూడా చేస్తున్నారన్నారు. కొన్ని యంత్ర పరికరాలు అవసమున్నాయని వైద్యులు తనకు తెలియజేశారని అవి కూడా ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే ఆస్పత్రికి అందిస్తామన్నారు.
- ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న డైట్ బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ తిరుమలేష్ వాపోయారు. సుమారు రూ.80 లక్షల బిల్లులు రావాలని, రూ.12 లక్షలు విడుదల చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ అనురాగినిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజు యాదవ్, ఆర్ఎంఓ డాక్టర్ చంద్ర కృష్ణ, వైద్యులు సుధాకర్ బాబు, ప్రహర్లాద, ఆస్పత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.